క్లుప్తంగా

నేటి 'తోట' నామినేషన్‌కు తరలిరండి

మండపేట: వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యేగా అభ్యర్థిగా తోట త్రిమూర్తులు బుధవారం పట్టణంలో నామినేషన్ వేస్తున్నందున పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పలివెల సుధాకర్ మంగళవారం విజ్ఞప్తి చేశారు. స్థానిక విజయలక్ష్మినగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి తోట త్రిమూర్తులు కాలినడకన భారీ ఊరేగింపుగా బయలుదేరి ఎన్నికల అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేస్తారని వివరించారు.

నేడు సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

కాజులూరు: మండలంలోని అండ్రంగి శివారు పెదపాటిగరువులో నూతనంగా నిర్మించిన రామాలయంలో నేడు (మంగళవారం) సీతా, రామా, లక్ష్మణ, ఆంజనేయస్వామి, అయ్యప్ప స్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం గణపతి హోమం నిర్వహించి, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన తదితర పూజలు చేపట్టారు. మంగళవారం నూతన విగ్రహాలతో గ్రామ ప్రదక్షిణ, ధ్వజారోహణ తదితర పూజలు నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

నేడు ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మండపేట: మెర్నిపాడులో నిర్మించిన 24 అడుగుల అభయాంజనేయ స్వామి వారి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించనున్నట్టు కమిటీ నిర్వాహకులు, సర్పంచ్ గారపాటి సౌజన్య, ఆమె భర్త అశోక్ కుమార్ తెలిపారు. రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ విగ్రహానికి గ్రామానికి చెందిన గారపాటి మురళీకృష్ణ రూ.ఆరు లక్షలు, వెంకటనగరం మాజీ సర్పంచ్ ఉప్పులూరి సత్యనారాయణ రూ.రెండు లక్షలు విరాళంగా అందించగా, మిగిలిన సొమ్ము దాతల నుంచి విరాళంగా సేకరించామన్నారు.

వైభవంగా రాజ్యలక్ష్మి అమ్మవారి తీర్థం

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రిక గ్రామంలోని శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారి తీర్థాన్ని ఆలయం వద్ద మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద సోమవారం రాత్రి ఘనంగా జాతర నిర్వహించారు. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, నల్లూరు గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

పీఠంలో చైత్ర పౌర్ణమి పూజలు

రాయవరం: డలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో చైత్ర పౌర్ణమి పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేద పండితులు చీమలకొండ వీరావధాని అర్చకత్వంలో పూజలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అమ్మవారికి మహిళా భక్తులు సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులు పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) ఆశీస్సులు పొందారు. అనంతరం పీఠానికి హాజరైన భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు చక్రవర్తుల మాధవాచార్యులు, శివ, పీఠం ప్రతినిధులు గాదే కృష్ణ, పీఆర్‌వో వాడ్రేవు వేణుగోపాల్, వడ్డాది రాంబాబు పాల్గొన్నారు.

'కృత్తివెంటి'లో గ్రంథాలయం ప్రారంభం

రామచంద్రపురం: ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. కె.సత్యలత ఆదేశాల మేరకు తెలుగు శాఖ గ్రంథాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. తెలుగు అధ్యాపకురాలు డా.ఎన్.సుజాత వారం రోజుల పాటు శ్రమించి డోనర్స్ ద్వారా సుమారు వెయ్యి పుస్తకాలను సేకరించారు. ప్రిన్సిపాల్ సత్యలత ఆనందాన్ని వ్యక్తపరుస్తూ రికార్డులను సక్రమంగా నడుపుతూ తెలుగు శాఖ లైబ్రరీని కొనసాగించాలన్నారు. తదనంతరం ప్రిన్సిపాల్ సత్యలత కొన్ని పుస్తకాలను విద్యార్థులకు వితరణ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవం స్పెషల్ తెలుగు విద్యార్థుల సహాయ సహకారాలు అందించినట్లు అధ్యాపకులు తెలిపారు.

ఉపాధ్యాయుడికి వీడ్కోలు సత్కారం

మండపేట: తాపేశ్వరం పోలిశెట్టి సత్తిరాజు భూషణం జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ చేసిన గుణ్ణం వీరన్నను ఆ పాఠశాల్లో మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు ముఖ్య అతిథిగా హాజరై, గుణ్ణం వీరన్న సేవలను కొనియాడారు. వీరన్న దంపతులను పలువురు పూలమాలలు, దుశ్శాలువాలు, జ్ఞాపికలు, బొకేలతో సత్కరించారు.

ఫలితం పదిలం

- వికసించిన ప్రభుత్వ విద్యా కుసుమాలు
- గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత శాతం
- ఉన్నత చదువులపై పేద విద్యార్థుల గురి
- ప్రభుత్వ సాయంపై ఆశలు



కపిలేశ్వరపురంలో పదో తరగతి విద్యార్థులు

కపిలేశ్వరపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కుసుమాలు వికసించాయి. ప్రభుత్వం కల్పించిన భరోసా, పాఠశాలల్లో సకల సదుపాయాలు, మెరుగైన విద్యాబోధన వెరసి గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది టెన్త్ ఫలితాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థుల కుటుంబాల్లో ఆనందం వెల్లివెరిసింది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో గతేడాది కంటే ప్రస్తుత విద్యా సంవత్సరం ఫలితాలు మెరుగైన తీరుపై ఈ కథనం...

'రామచంద్రపురం'లో ఉత్తీర్ణత పెరుగుదల ఇలా...

రామచంద్రపురం పట్టణంలోని 7 పాఠశాలలకు గానూ గతేడాదిలో 400 మంది పరీక్షలు రాయగా 228 మంది పాసై, 57 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. అదే ఈ ఏడాది 391 మందికి 314 ఉత్తీర్ణులై 81 శాతం నమోదు చేశారు. రూరల్ మండలంలోని 8 పాఠశాలలకు గానూ గతేడాది 502 మందికి 248 మంది ఉత్తీర్ణులు కావడంతో 50 శాతం నమోదైంది. ఈ ఏడాది 533 మందికి 450 మంది ఉత్తీర్ణులు కావడంతో 85 శాతం నమోదైంది. కాజులూరు మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలల నుంచి గతేడాది 605 మందికి 431 మంది ఉత్తీర్ణులై, 72 శాతం నమోదు కాగా ఈ ఏడాది 95 శాతం నమోదైంది. కె.గంగవరం మండలంలోని 8 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి గతేడాది 62 శాతం ఉత్తీర్ణత శాతం నమోదు కాగా ఈ ఏడాది 450 మందికి 418 మంది ఉత్తీర్ణులై 93 శాతం నమోదు చేశారు.

'మండపేట'లో పెరిగిన ఉత్తీర్ణత

గతేడాది మండపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 2,130 మంది విద్యార్థులకు 1,510 మంది పాస్ కావడంతో 71 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఏడాది 2,095 మందికి 1,806 మంది ఉత్తీర్ణులు కావడంతో 87 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మండపేట మండలం ప్రభుత్వ పాఠశాలల నుంచి గతేడాదిలో 1,015 మంది పరీక్షలు రాయగా 673 మంది ఉత్తీర్ణులై 67 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. ఈ ఏడాది 1008 మంది పరీక్షలు రాయగా 817 మంది ఉత్తీర్ణులయ్యారు. 81 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాయవరం మండలంలో గతేడాదిలో 642 మందికి 462 మంది ఉత్తీర్ణులై 71 శాతం నమోదైంది. ఈ ఏడాది 700 మంది పరీక్షలు రాయగా 614 మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో 88 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కపిలేశ్వరపురం మండలంలోని ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి గతేడాది 473 మంది విద్యార్థులు హాజరు కాగా 349 మంది ఉత్తీర్ణులై 74 ఉత్తీర్ణత శాతం నమోదు చేశారు. ఈ ఏడాది 387 మందికి 375 మంది ఉత్తీర్ణత సాధించడంతో 97 శాతానికి ఉత్తీర్ణత శాతం పెరిగింది.

సూక్ష్మ వారీగా..

గతేడాది కపిలేశ్వరపురం మండలం టేకి జెడ్పీ ఉన్నత పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల ఆ స్థానంలో నిలిచింది. అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలకు గతేడాది 83 శాతం ఫలితాలు రాగా, ఈ ఏడాది నూరు శాతం ఫలితాలు దక్కించుకుంది. వాకతిప్ప గతేడాది 83 శాతం కాగా ఈ ఏడాది 96 శాతం, వల్లూరు గతేడాదిలో 76 శాతం కాగా ఈ ఏడాది 95 శాతం, మాచర 67 శాతం కాగా 97 శాతానికి, నల్లూరు 66 శాతం నుంచి 93 శాతానికి, కపిలేశ్వరపురం 65 శాతం నుంచి 96 శాతానికి, కాలేరు జెడ్పీ ఉన్నత పాఠశాల 64 నుంచి 96 శాతానికి ఉత్తీర్ణత శాతం పెరిగింది. గతేడాదిలో కపిలేశ్వరపురం మండలంలో ప్రథమ స్థానంలో అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి వంగా బాంధవి రమా నిలవగా ఈ ఏడాది కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి జీపీ సమీర ప్రథమ స్థానంలో నిలిచింది. గతేడాది రెండో స్థానంలో వల్లూరు పాఠశాల విద్యార్థి బొల్లంరెడ్డి సాయితేజ నిలవగా ఈ ఏడాది మాచర పాఠశాల విద్యార్థి జీఎస్‌వీ మణికంఠ నిలిచాడు. తృతీయ స్థానంలో గతేడాది అంగర పాఠశాల విద్యార్థిని శలా గీతికారత్నం నిలవగా ఈ ఏడాది టేకి పాఠశాల విద్యార్థిని జీవీ కనకదుర్గ నిలిచింది.

సదుపాయాలు తోడ్పాటునిచ్చాయి



కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతూ పదో తరగతి ఫలితాల్లో 557 మార్కులు సాధించాను. ప్రభుత్వం పాఠశాలను మెరుగుపరచడమూ, అన్ని సదుపాయాలు కల్పించడమూ, ఉపాధ్యాయులు మెరుగైన శిక్షణ నివ్వడంతో నాకు అత్యధిక మార్కులు వచ్చాయి. – జీపీ సమీర, కపిలేశ్వరపురం మండల ప్రథమ స్థానం పొందిన విద్యార్థి

ఐదో రోజు 7 నామినేషన్లు

రామచంద్రపురం: రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఐదో రోజు మంగళవారం అరుగురు 7 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్ మీడియాకు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కోట వరలక్ష్మి, భారత చైతన్య యువజన పార్టీ నుంచి బర్ల వెంకట శ్రీనివాసరావు, ఇదే పార్టీ నుంచి బర్ల పార్వతి, బీఎస్పీ నుంచి మాతా మంగాదేవి, లంక ప్రవీణ్‌కుమార్ ఇండిపెండెంట్‌గా ఒక్కో సెట్ చొప్పున, బీఎస్పీ నుంచి మాతా రాణి రెండు సెట్ల నామినేషన్లు ఆర్వో సుధాసాగర్‌కు సమర్పించారు. వారికి నిబంధనలతో కూడిన నియమావళి బుక్‌లెట్ కిట్‌ను ఆర్వో వారికి అందజేశారు. కాగా మంగళవారం వరకు మొత్తం 15 మంది అభ్యర్థులు 20 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో సుధాసాగర్ తెలిపారు.

ఎకరాకు 55 బస్తాల ధాన్యం

రాయవరం: ఉచిత పంటల బీమా పథకం కింద వ్యవసాయాధికారులు మంగళవారం మండలంలోని వెంటూరు గ్రామంలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పంట కోత ప్రయోగాన్ని ముమ్మిడివరం జిల్లా వనరుల కేంద్రం నుంచి వచ్చిన ఏడీఏ రాజశేఖర్ పరిశీలించారు. స్థానిక రైతు లంక నాగేంద్ర వరి పొలంలో 5/5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఎంటీయు 3626 (బొండాలు) రకం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ ప్రయోగంలో ఎకరానికి 55 బస్తాలు (75 కేజీలు) దిగుబడి వచ్చినట్టుగా నిర్ధారించారు. అనంతరం వారు వెంటూరు ఆర్‌బీకేని సందర్శించారు. ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలు రిజిస్టర్‌ను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు.

నిన్ను నమ్మం బాబూ..

- గతంలో ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన చంద్రబాబు
- నిన్ను ఎలా నమ్మాలని ప్రశ్నిస్తున్న నియోజకవర్గ ప్రజలు


రామచంద్రపురం: ఎన్నికలు వచ్చినప్పుడు నియోజకవర్గానికి వచ్చి చంద్రబాబు నాయుడు ఇస్తున్న హామీలను వింటుంటే నవ్వొచ్చేదురుగాక అనే చందాన ఉంది. 2019 ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందు అంటే 2018లో నియోజకవర్గానికి సీఎం హోదాలో వచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు. ఇంకా అధికారం ఒక ఏడాది ఉన్నా ఇచ్చిన హామీలను ఏమాత్రం పట్టించుకోకుండా తుంగలో తొక్కేశారు. తిరిగి ఇప్పుడు ఎన్నికల వేళ ద్రాక్షారామలో జరిగిన బహిరంగ సభలో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ చంద్రబాబు వల్లిస్తున్న వాగ్దానాలను విని నియోజకవర్గ ప్రజలు నవ్వుకుంటున్నారు. అంతేకాకుండా మందు బాబులను ప్రోత్సహిస్తూ చేసిన ప్రసంగం మహిళలను ఆగ్రహానికి గురిచేసింది.

గతంలో నియోజకవర్గానికి ఇచ్చిన హామీలివి..

2018 జనవరి 5న సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు నూతనంగా నిర్మించిన ఆర్డీవో కార్యాలయం ప్రారంభానికి విచ్చేశారు. స్థానిక వీఎస్ఎం కళాశాలలో బహిరంగ సభను నిర్వహించారు. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న తోట త్రిమూర్తులు నియోజకవర్గ సమస్యలను చంద్రబాబు ముందు విన్నవించారు. గోదావరి ఏటిగట్టుకు సంబంధించి జొన్నాడ నుంచి కూళ్ల, సుందరపల్లి కోటిపల్లి, మసకపల్లి మీదుగా యానాం వరకు ఏటిగట్టును డబుల్ లైన్ రోడ్డుగా ప్రతిపాదనలు చేసి విస్తరించేందుకు చంద్రబాబుకు వివరించారు. దీనికి సర్వేలు చేసి సుమారుగా రూ.170 కోట్ల అంచనాలను అధికారులు తయారు చేసిన ప్రతిపాదనలను అప్పట్లో చంద్రబాబుకు తోట త్రిమూర్తులు అందించగా నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఎన్నికలకు ముందు దీనికి ఉత్తుత్తి జీవోను రిలీజ్ చేసి దానిని బుట్టదాఖలు చేసిన నైజం చంద్రబాబుది. ఏటిగట్టు విస్తరణకు చంద్రబాబు ఇచ్చిన హామీ కూడా గోదాట్లో కలిపేసిన చంద్రబాబు ఇప్పుడు మరలా నియోజకవర్గానికి వచ్చి నాది గ్యారంటీ అని చెప్పడం విడ్డూరంగా ఉందని ముక్కున వేలేసుకుంటున్నారు.

రామచంద్రపురం పట్టణానికి రెండో బైపాస్ రోడ్డు నిర్మాణం గురించి చంద్రబాబుకు అప్పట్లో త్రిమూర్తులు విన్నవించారు. పసలపూడి లాకుల వద్ద నుంచి పంట కాలువ మీదుగా వెల్ల పెద్ద వంతెన వరకు రెండో బైపాస్ రోడ్డు వేస్తే పట్టణం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని వివరించి నిధులు కావాలని కోరారు. అందుకు చంద్రబాబు కూడా నిధులు కేటాయిస్తానని హామీనిచ్చి గాలికొదిలేశారు. అలాగే ద్రాక్షారామం పుణ్యక్షేత్రం కావటంతో ద్రాక్షారామకు రింగు రోడ్డు ప్రతిపాదనను వివరించగా హామీ ఇచ్చి నిధులు మాత్రం మంజూరు చేయలేదు.

రామచంద్రపురం పట్టణంలో ఇళ్ల లేని వారు 4వేల మంది ఉన్నారని, వారందరికీ టిడ్కో గృహాలను ఎన్నికల లోపు నిర్మించి ఇస్తామని చంద్రబాబు గట్టిగానే చెప్పారు. 2019 ఎన్నికలు అయినా కానీ ఒక్క ఇల్లు కూడా పూర్తి చేయలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక 1098 మంది లబ్ధిదారులకు గృహాల పట్టాలను అందించి గృహప్రవేశాలు చేయించారు. మరో 3 వేల టిడ్కో గృహాలు శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పుడేమో చంద్రబాబు టిడ్కో గృహాలను పూర్తిగా ఉచితంగా ఇస్తానని చెబుతున్న ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయంటున్నారు. రామచంద్రపురం పట్టణానికి ఫైబర్ గ్రిడ్‌ను తీసుకువచ్చి పట్టణంలో వారందరికీ ఉచితంగా ఇంటర్ నెట్ సౌకర్యాన్ని కల్పిస్తామని 2018లో జరిగి బహిరంగ సభలో చంద్రబాబు హామీనిచ్చి వెళ్లిపోయారు. కానీ చేసింది మాత్రం శూన్యం. కానీ ఇప్పుడేమో నియోజకవర్గంలోని ద్రాక్షారామలో జరిగిన సభలో చేసిన ప్రకటనలు, హామీలు నవ్వొస్తున్నాయని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. భవిష్యత్‌కు గ్యారంటీ, బాబూ ష్యూరిటీ అని చెబుతూ నియోజకవర్గంలో తిరుగుతున్న టీడీపీ నేతలను స్థానిక ప్రజలు అప్పట్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏమయ్యాయంటూ ప్రశ్నిస్తున్నారు.



కూటమికి ఓటేస్తే సంక్షేమం గోవిందా



ఉడిమూడిలో పూలు జల్లుతూ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు, స్థానిక పెద్దలు

ప్రచారంలో దూకుడు పెంచిన సూర్యప్రకాశ్

కె.గంగవరం: రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓటు వేస్తే సంక్షేమానికి తిలోదకాలు ఇస్తారని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని ఉడిమూడి, సుందరపల్లి, కోటిపల్లి, కోట గ్రామాల్లో మంగళవారం ఆయన జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాలుగు గ్రామాల్లో అడుగడుగునా మహిళలూ ఆయనకు హారతులు ఇచ్చి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పేదలు ఏ లబ్ధి కావాలన్నా జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించుకోవాల్సి వచ్చేదని, కానీ జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ 58 నెలల్లో అర్హులైతే చాలు సంక్షేమం ఇంటి గుమ్మంలోకే వచ్చేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని తెలిపారు. సంక్షేమ ప్రభుత్వం కావాలో, జన్మభూమి కమిటీలు కావాలో ప్రజలు ఇప్పటికే ఆలోచించి సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేసి మీ ముందుకు వచ్చామన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులతో కలసి ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ వంపన నాగమణి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి వట్టికూటి రాజశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు, కాపు నాయకులు అడపా నారాయణస్వామి, యర్రంశెట్టి పుల్లేశ్వరరావు, తాడాల రాజు, కోటిపల్లి సొసైటీ అధ్యక్షుడు సాదా వెంగళరావు, పార్టీ నాయకులు సాదు, పిల్లి రాంబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ధనమ్మ తీర్థానికి ముమ్మరంగా ఏర్పాట్లు

- రెండు నియోజకవర్గాల సరిహద్దులో ఉమ్మడి జాతర
- భారీ సంఖ్యలో తరలిరానున్న భక్తజనం

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం గొల్లపాలెం, కరప మండలం కొంగోడు గ్రామాల సరిహద్దులో వెలసిన శ్రీధనమహాలక్ష్మి (ధనమ్మ) అమ్మవారికి తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ యాజమాన్యం, నిర్వాహక కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు నియోజకవర్గాల సరిహద్దులో ఉమ్మడి గ్రామదేవత అయిన ధనమ్మతల్లికి ఏటా జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతుంటాయి. రెండు గ్రామాల సరిహద్దులో వెలసిన అమ్మవారికి ఆ నాడు భక్తులు రెండు ఆలయాలను నిర్మించగా క్రమేపీ అది రెండు మండలాల సరిహద్దు నుంచి రెండు నియోజకవర్గాల సరిహద్దుగా మారింది. అయినప్పటికీ నేటికి ఇరు గ్రామాల పెద్దలు సఖ్యతతో ఒకే రోజున ఇక్కడ అమ్మవారికి తీర్థమహోత్సవాలు నిర్వహిస్తున్నారు. సుమారు రెండు వందల యాభై సంవత్సరాల క్రితం రెండు గ్రామాల సరిహద్దుల్లో అమ్మవారికి రెండు ఆలయాలు నెలకొల్పబడ్డాయి. నాటి నుంచి ఈ రెండు గ్రామాల ప్రజలు ధనమ్మ అమ్మవారిని గ్రామ దేవతగా కొలుస్తూ పూజలు చేస్తున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి భక్తుల తాకిడితో కరప మండలం గొర్రిపూడి నుంచి కాజులూరు మండలం ఆర్యావటం వరకూ రహదారి కిటకిటలాడుతుంది. కార్యక్రమాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాటు చేసినట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు

ధనమ్మతల్లి ఆలయాలు కాకినాడ, కోటిపల్లి రహదారిపై ఉండటంతో రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించినట్టు గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.తులసీరామ్ తెలిపారు. వాహనాలను గొల్లపాలెం పంచాయతీ వెనుక రహదారి నుంచి కొంగోడు మీదుగా వెంకటేశ్వరస్వామి ముఖద్వారం వరకూ మళ్లిస్తున్నామన్నారు. తీర్థమహోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కరప, గొల్లపాలెం, కోరంగి, ఇంద్రపాలెం, పోలీస్‌స్టేషన్లతో పాటు కాకినాడ నుంచి 200 మంది పోలీసు బలగాలను రప్పిస్తున్నామన్నారు.



తీర్థ మహోత్సవాలకు సిద్ధమవుతున్న ధనమ్మతల్లి ఆలయాలు (అంతర చిత్రం) ధనమ్మతల్లి

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ గ్రామానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు సలాది అర్జునరావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన జనసేన నాయకులు సలాది ప్రసన్నకుమార్, అడబాల ఆదినారాయణ, చామకూర రామారావుతో పాటు సుమారు 50 మంది వైఎస్సార్ సీపీ రామచంద్రపురం కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ సమక్షంలో పార్టీలో చేరారు. వారిని సూర్యప్రకాశ్ పార్టీ కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి పరిపాలన చేస్తున్నారని పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆయన పాలనకు ఆకర్షితులమై చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని చేసేందుకు కృషి చేస్తామన్నారు.



సత్యవాడలో వైఎస్సార్ సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్ తదితరులు

'తోట' దళిత వ్యతిరేకి అనేది ఓ కుట్ర

దళిత సంఘాల నాయకులు

కపిలేశ్వరపురం: దళిత వ్యతిరేకిగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును చిత్రీకరించడం ప్రతిపక్షాల కుట్ర పూరితమైన ప్రయత్నమని పలువురు కపిలేశ్వరపురం మండల దళిత నాయకులు అన్నారు. కపిలేశ్వరపురంలో దళిత నాయకులు పిప్పర సంపతరావు, మల్లిపూడి శివకుమార్, పలివెల మధు, తాతపూడి సుబ్రహ్మణ్యం, తాతపూడి విజయ్, తాతపూడి రాజేష్‌శర్మ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో దళిత సంఘాల పేరుతో ఇటీవల కొందరు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. నియోజకవర్గంలోని దళిత కుటుబాలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అండగా నిలిచారనేదానికి అనేక ఘటనలు ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లిన దళితుల సమస్యలు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్న విషయాన్ని ఆయన మద్దతుదారులు గుర్తుంచుకోవాలన్నారు. దళిత సమస్యను తన దృష్టికి తీసుకెళ్ళిన వెంటనే ఎమ్మెల్సీ తోట త్వరితగతిన పరిష్కారం చేస్తున్నారన్న విషయం క్షేత్ర స్థాయిలోని దళిత సామాజిక వర్గీయులందరికీ తెలుసు అన్నారు. టేకి గ్రామానికి చెందిన దళిత విద్యార్థి సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో తలెత్తిన సాంకేతిక సమస్యను ఎమ్మెల్సీ తోట 24 గంటల్లో పరిష్కరించారన్నారు. అదే గ్రామానికి చెందిన దళితుడు మరణించగా ఆయన కుటుంబానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆసరాగా సాయమందించిన విషయాన్ని ప్రస్తావించారు. ఎమ్మెల్సీ తోటను దళిత వ్యతిరేకిగా తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని మధు, సంపతరావు, శివకుమార్ తదితరులు హితవు పలికారు.

నామినేషన్ దిగ్విజయం కావాలంటూ పూజలు

మండపేట: హనుమత్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మెయిన్ రోడ్ లోని స్టేట్ బ్యాంక్ వద్ద గల భక్తాంజనేయ స్వామికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా త్రిమూర్తులు బుధవారం వేస్తున్న నామినేషన్ విజయవంతం కావాలని, ఆయన విజయం సాధించాలని కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకుడు అంజూరి శ్రీనివాస్ చౌదరి ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ చౌదరి ఆంజనేయ స్వామికి 108 టెంకాయలు కొట్టారు. కొబ్బరి నీళ్లతో స్వామివారికి అభిషేకం చేశారు. ఐదు రకాల పుష్పాలతో అర్చన చేశారు. తమలపాకులు, గంధం, సింధూర నామార్చన చేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్, కౌన్సిల్లో విప్ పోతంశెట్టి వరప్రసాద్, ఆంజనేయ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ సూరంపూడి సత్య ప్రసాద్, గెడా శివ, జొన్నల కన్నబాబు జొన్నల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి పూజలు చేస్తున్న శ్రీనివాస్‌చౌదరి తదితరులు

జనసేనను వీడి వైఎస్సార్ సీపీలోకి..

మండపేట: కొత్తగా వైఎస్సార్ సీపీలో చేరిన వారందరికీ తాను అండగా ఉంటానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు భరోసా ఇచ్చారు. మండలంలోని తాపేశ్వరం, పట్టణంలోని 19వ వార్డుకు చెందిన పలువురు మంగళవారం జనసేన పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక విజయలక్ష్మీ నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వారందరినీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. తాపేశ్వరం నుంచి పార్టీలో చేరిన వారిలో వీరిస్వామి అయ్యప్ప, రాజాని అశోక్‌రాజా , నూకారపు ప్రసాద్, రాయపూడి రాంబాబు, రాయపూడి వీరబాబు, బి.నరేష్ ,రేగడ అప్పారావు, రేగడ శివ రామకృష్ణ వున్నారు. వైఎస్సార్ సీపీ నేత ఆంజూరి శ్రీనివాస్ చౌదరి ప్రోత్సాహంతో 19వ వార్డుకు చెందిన జనసేన యువ నాయకుడు మామిడిపల్లి పట్టాభి వైఎస్సార్ సీపీలో చేరారు. అలాగే పట్టణానికి చెందిన మహిళా నాయకురాలు తటవర్తి చంద్రావతి కూడా పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్ పోతంశెట్టి ప్రసాద్, గుమ్మిలేరు శ్రీను, కనికెళ్ళ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల పురోగతి

కాజులూరు: మండలంలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పురోగతి సాధిస్తున్నాయని కాజులూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి అన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉతీర్ణత సాధించిన విద్యార్థులకు మంగళవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో వసతులు మెరుగుపడుతున్నాయన్నారు. ఫలితంగా ఈ ఏడాది తమ పాఠశాల నుంచి 156 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు వ్రాయగా 150 మంది ఉత్తీర్ణులై 96 శాతం ఉతీర్ణత సాధించారన్నారు. ఇందులో కోన ఉమాలలితాంబిక 570 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానం సాధించగా, కోన సుస్మిత 566 మార్కులతో, కోడూరి సాయిహర్షిత 561 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. వీరితో పాటు 500 మార్కులు దాటి విజయం సాధించిన వారు 35 మంది ఉన్నారన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అంబేద్కర్ గురుకులంలో శత శాతం ఉత్తీర్ణత

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్‌వీ నాగేశ్వరరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. పాఠశాల నుంచి 74 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 74 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరిలో 62 మంది ఫస్ట్ క్లాస్‌లోను, 10 మంది సెకెండ్ క్లాస్‌లోను, ఇద్దరు థర్డ్ క్లాస్‌లోను ఉత్తీర్ణత సాధించారన్నారు. కొల్లి సుజన్ 538 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అభినందించారు.